క్లుప్తంగా

రేపు గుండ్లశింగవరానికి ఎంపీ, ఎమ్మెల్యే రాక

అవుకు: మండల పరిధిలోని గుండ్లశింగవరం గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం ఈ నెల 11న నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి ఆదివారం తెలిపారు. గుండ్లశింగవరంలో దాదాపు రూ.2.65 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు. అదేవిధంగా అవుకు మండల ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, గుండ్లశింగవరం సర్పంచ్ కాటసాని రమాకాంత్ రెడ్డి, కాటసాని కుటుంబ సభ్యులు కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

రజక సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగేంద్ర



నియామక పత్రాన్ని అందుకుంటున్న కలం నాగేంద్ర

బనగానపల్లె: అఖిల భారత రజక సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులుగా సంజామల మండలం ముదిగేడు గ్రామానికి చెందిన కలం నాగేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు మొగ్గ అనిల్‌కుమార్ నియామకం పత్రాన్ని నాగేంద్రకు అందజేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు సురేష్, శంకర్, ఈశ్వరయ్య, చాకలి ఐలన్న, పాలరాముడు, కంబగిరిరాముడు, సుబ్బరాయుడు, నాగేశ్వరరావు, సుబ్బయ్య, బాలుమహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో కబడ్డీ పోటీలు

అవుకు: మండల పరిధిలోని ఉప్పలపాడులో శ్రీకంబగిరి స్వామి తిరునాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన కబడ్డీ పోటీలను వైఎస్సార్ సీపీ నేతలు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని క్రీడాకారులకు ఈ సందర్భంగా వారు సూచించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో కొండమనాయునిపల్లె, ఉప్పలపాడు కింగ్స్, జీడీఎస్ జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలువగా బహుమతులను అందజేశారు. అదేవిధంగా సాయంత్రం చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి అవుకు పట్టణంలోని చల్లా కార్యాయంలో వలంటీర్లు, గృహసారథులతో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునికి సత్కారం



రాజశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

డోన్ : డోన్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డిని ఆదివారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌తో పాటు పలువురు ప్రముఖులు ఆయన స్వగృహంలో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాయలసీమ క్లస్టర్ యూనివర్సిటీ ఈసీ సభ్యులు నాగభూషణంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, క్వాలిటీ అబ్దుల్లాలు పాల్గొన్నారు.

తెలుగు సంప్రదాయాలు పాటించండి

అవుకు: తెలుగు సాంప్రదాయాలను పాటించాలని అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ అన్నారు. ఆదివారం అవుకు పట్టణంలోని చల్లా కార్యాలయంలో త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకముల సారములతో తెలుగు నెలలు అనుసరించుటకు వీలుగా తిథులతో ఆంగ్లతేదీలను పొందుపరిచి ఈ క్యాలెండర్ రూపొందించడం గొప్ప విషయమన్నారు. అదేవిధంగా కంబగిరిస్వామి తిరునాల సందర్భంగా ఉప్పలపాడులో వెలసిన పెద్దమ్మ అమ్మవారికి వైఎస్సార్‌సీపీ నేత చల్లా ప్రభాకర్ రెడ్డితో కలిసి శ్రీలక్ష్మీ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యువ నాయకులు చల్లా విక్రాంత్ రెడ్డి, చల్లా చైతన్య రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. అన్ని మతాల సారం ఒక్కటే అని, సర్వ మాతాలకు దేవుడు ఒక్కడే అని కుల మతాలను రూపు మాపేది త్రైత సిద్ధాంతం అని ధర్మవరం కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మద్దిలేటి, వెంకటేష్, పరశురాముడు, సుధాకర్ నాయుడు, శ్రీనివాసులు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

భానుడు భగభగ!

- రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- జిల్లాలో 40 డిగ్రీలు దాటిన వైనం
- ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి
- శీతల పానీయాలకు పెరిగిన గిరాకీ
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు



ఎండ తీవ్రతతో కోవెలకుంట్ల పట్టణంలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన వీధులు

కోవెలకుంట్ల: వేసవి ప్రారంభం నుంచే భానుడు విశ్వరూపం ప్రదర్శిస్తున్నాడు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎండ తీవ్రతతోపాటు వడగాలులు ప్రజానీకాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నంద్యాల జిల్లాలోని మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటీవల బనగానపల్లె పట్టణంలో ఏకంగా 40.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. ఉదయం పది గంటల నుంచే భానుడు భగభగమంటున్నాడు. సాయంత్రం 6 గంటల వరకు ఎండతీవ్రత తగ్గడం లేదు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండతీవ్రతతో ప్రజల ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ప్రత్యేకించి వృద్ధులు, చిన్నపిల్లలు ఉక్కిబిక్కిరవుతున్నారు.

శీతల పానీయాలకు పెరిగి గిరాకీ

ఎండలు అధికం కావడంతో ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలవైపు పరుగులు పెడుతున్నారు. మజ్జిగ, లస్సీ, చెరుకు రసం వంటి పానీయాలకు గిరాకీ పెరిగింది. నంద్యాల, కోవెలకుంట్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ తదితర పట్టణాల్లో అన్ని ప్రధాన కూడల్లో చెరుకు రసం, శీతల పానీయాల షాపులు కిటకిటలాడుతున్నాయి. అదేవిధంగా కూలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీలకు డిమాండ్ పెరిగింది. ఒంటిపూట బడులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు ఈత కొడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. కుందూనది, పాలేరువాగు, బావులలో ఈత కొడుతూ విద్యార్థులు, యువత సేదతీరుతున్నారు.

వడదెబ్బ లక్షణాలు:

ఎండలు ఎక్కువైనప్పుడు మనిషి శరీరంలోని ఉష్ణోగ్రతను నియంత్రించే నాడీ వ్యవస్థ దెబ్బతిని వడదెబ్బకు గురవుతారు. శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుంది. తీవ్ర తలనొప్పి, తల తిరగడం, నాలిక ఎండిపోవడం, చెమట పట్టకుండుట, ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం కలిగి ఉండటం, మగత కలవరింతలు, ఫిట్స్, పాక్షిక, పూర్తి అపస్మారకస్థితి వడదెబ్బ లక్షణాలు. ఉపాధి కూలీలు, 50 సంవత్సరాలు వయస్సు పైబడిన వ్యక్తులు, వేడి ఎక్కువగా ఉన్నచోట ఎక్కువ శ్రమతో కూడిన పనులు చేయడం, గర్భిణీలు, బాలింతలు, అప్పుడే పుట్టిన శిశువులు, పసిపిల్లలు, రేకుల షెడ్లలో నివసించే వ్యక్తులు, అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది.

వడదెబ్బకు ప్రాథమిక చికిత్స

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. ఆ వ్యక్తి శరీరంపై ఉండే దుస్తులు తొలగించి చల్లని నీటితో శరీరాన్ని కడగాలి. ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరాన్ని తుడిచి చల్లని గాలి తగిలేలా చూడాలి. చల్లని నీరు, ఉప్పు, ఇతర లవణాలు కలిపిన నీరు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. వెంటనే ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలందించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తిరగకూడదు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన పళ్ల రసాలు తాగి బయలు దేరాలి. తెల్లని దుస్తులు ధరించాలి. నల్లని వస్త్రాలు ఏ మాత్రం ధరించకూడదు. ఆల్కాహాల్ సేవించడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చి విషమ పరిస్థితికి దారి తీస్తుంది. ఇంటి గదుల్లో ఉష్ణోగ్రతను తగ్గించడానికి కిటికీలు, తలుపులకు తెరలు వాడి వేడిని తగ్గించుకోవాలి. ఫ్యాన్లు, ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండీషన్లు వాడాలి. బయటకు వెళ్లాల్సిన తప్పని పరిస్థితుల్లో గొడుగు లేదా తలకు టోపీ, కనీసం రుమాల ధరించాలి.

జాగ్రత్తలు పాటించాలి



వేసవికాలంలో ఎండలు తీవ్రతరమైనందున వడదెబ్బబారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడదెబ్బ తగిలిన వారిలో 40 శాతం మంది మృత్యువాత పడే ఆస్కారం ఉంది. వడదెబ్బకు గురి అయిన వ్యక్తికి తక్షణమే వైద్య సేవలు అందిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చు. –చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్‌సీ డాక్టర్, కోవెలకుంట్ల



తాటి ముంజలను ఎగబడి కొనుగోలు చేస్తున్న దృశ్యం



ఈత కొడుతున్న చిన్నారులు

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

13న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 13న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఎంఎస్ఎఫ్, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ. 10వేలు, రూ. 8వేలు, రూ. 6వేలు, రూ. 4 వేలు, రూ. 2వేలు, వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు పాదరక్షల పంపిణీ

డోన్ టౌన్: వేసవి నేపథ్యంలో పట్టణంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థినులకు ఆదివారం దాతల ఆర్థిక సహకారంతో స్ఫూర్తి సేవా సమితి సభ్యులు పాదరక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ లక్ష్మీబాయి, స్ఫూర్తి సభ్యులు సీసంగుంతల మధు, చంద్ర, బ్రహ్మానందరెడ్డి, జగదీష్, అంజీ, యోగ తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి

బనగానపల్లెరూరల్: ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మండలంలోని కైప గ్రామ సమీపంలో ఉన్న బిజ్జి తిమ్మయ్యస్వామి దర్గా వద్ద రూ.5 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. ఎంపీ మాట్లాడుతూ బిజ్జి తిమ్మయ్యస్వామి దర్గా వద్ద భక్తుల కోరిక మేరకు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బిజ్జి తిమ్మయ్యస్వామి దర్గా అభివృద్ధికి తనవంతు పూర్తిసహకారం అందిస్తానని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. అలాగే బిజ్జి తిమ్మయ్యస్వామి దర్గాను ఎంపీ, ఎమ్మెల్యేలు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో గుండ్ల శింగవరం సర్పంచ్ కాటసాని రమాకాంత్‌రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న నగర పంచాయతీ చైర్మన్, నాయకులు

బేతంచెర్ల: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నారని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 3, 5 సచివాలయ పరిధిలో ఉన్న హనుమాన్ నగర్, బోయపేట కాలనీల్లో జగనన్నే మా భవిష్యత్తు– జగనన్నే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ నాగజ్యోతి, పట్టణ సచివాలయ కన్వీనర్ అజాం బాషా, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి చైర్మన్ ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించారు. ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించి, యాజమాన్యాల అనుమతితో ఇళ్లకు మానమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అతికించారు. అనంతరం నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరిందని చెప్పారు. గత ప్రభుత్వ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన తేడాలను గమనించాలని, మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మధు సూధన్ రెడ్డి, ఖాజా, సుభాన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మి సుబ్బమ్మ

బనగానపల్లె: సీఎం జగన్ పాలనలో కులాలు, పార్టీలు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మి సుబ్బమ్మ అన్నారు. జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని మూడవ సచివాలయ పరిధిలోని ఈద్గానగర్ 8వ వార్డులో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి యాజమాన్యాల అనుమతితో మా నమ్మకం నీవే జగనన్న స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ కంబగిరి, గృహసారథులు, వలంటీర్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ అబ్బాస్, అబ్దుల్ రహీమాన్, రషీద్, దాదాబాషా తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై చెన్నకేశవస్వామి

బేతంచెర్ల : పట్టణంలోని గౌరిపేటలో వెలసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నకేశవస్వామిని ఆదివారం రాత్రి శేషవాహనంపై పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన మహామంగళహారతి నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సుజాత శర్మ, కమిటీ సభ్యులు మారుతి శర్మ, బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, గణేష్ రెడ్డి, నాగ మోహన్, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్, ముస్లిం సోదరులు

బేతంచెర్ల: పట్టణంలోని హనుమానగర్, సంజీవనగర్ కాలనీలో నివాసం ఉండే ముస్లింలు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డికి విన్నవించారు. ఈ మేరకు ఆదివారం నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు మూర్తుజావలీ, మండల ఖాజీ నూర్ అహ్మద్, నాయకులు ఖాజ, ముస్లిం సోదరులతో కలిసి హనుమాన్ నగర్ కాలనీ సమీపాన ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ముస్లిం సోదరులకు అనువైన స్థలం కేటాయించి అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ చైర్మన్ తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



చల్లని నీరు పంపిణీ చేస్తున్న దృశ్యం

బనగానపల్లె: స్థానిక కూరగాయాల మార్కెట్‌లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో సంఘం నాయకులు కూలింగ్ వాటర్ చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సేవా సమితి సభ్యులు షాభీర్, తిరుపాల్‌గౌడ్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కూలింగ్ వాటర్ అందజేసేందుకు సొంత నిధులు వెచ్చిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రజల తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగ వేడుకలు



ఏబీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలో ఆదివారం క్రైస్తవ సోదరులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే రోజున శిలువ మరణం పొందిన ఏసుక్రీస్తు పునరుత్థానుడు కావడంతో(మరణాన్ని జయించిన రోజును పురస్కరించుకుని) ఆయా గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం రంగులు చల్లుకుని భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల ఫాస్టర్లు లూర్దు, ప్రకాష్, సామేల్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవ రూప ధారియైన రక్షకుడిగా లోకానికి తన పరమ తండ్రి ఆదేశాలు, సంకల్పాలను అమలు పర్చడానికి వచ్చిన దేవుడన్నారు.

బేతంచెర్ల : మండలంలో ఈస్టర్ పండుగ వేడుకలను క్రైస్తవ సోదరులు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక ఆర్సియం, ఎయస్‌ఐ, హోసన్నా ప్రార్థన మందిరాల్లో అధిక సంఖ్యలో క్రైస్తవ సోదరులు మహిళలు, చిన్నారులు పాల్గొని ప్రార్థనలు చేశారు. సిమెంట్‌నగర్ గ్రామంలో సీఎస్ఐ చర్చి, ఏబీఎం చర్చిలో ఫాస్టర్ల ఆధ్వర్యంలోక్రైస్తవ సోదరులు, మహిళలు చర్చి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.

బనగానపల్లెరూరల్: బనగానపల్లె మండలంలో ఈస్టర్ పండుగను క్రైస్తవ సోదరులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో క్రైస్తవులు చర్చీలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చిలో రెవరెండ్ ఆల్‌బర్ట్, మదర్ థెరిస్సా చర్చిలో ఫాదర్ రమేష్‌బాబుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన చేశారు.

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లతోపాటు గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బెలుం సీఎస్ఐ చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలను ఆనందోత్సాల మధ్య చేసుకున్నారు. చిన్న పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకున్నారు. బస్టాప్ సమీపంలోని కొండపై చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



రంగులు చల్లుకుంటున్న యువత

ప్యాపిలి: మండల కేంద్రం ప్యాపిలితోపాటు గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక బైబిల్ మిషన్ చర్చిలో రెవరెండ్, ఏఓ బందెలరాజు ఏసుక్రీస్తు సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో బైబిల్ మిషన్ సంఘ సభ్యులు ఆశీర్వాదం, రామచంద్రుడు, దావీదు, దానియేలు, ఆనంద్‌రాజు, సురేశ్‌బాబు, మణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కేసు నమోదు

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం పేరుసోముల గ్రామానికి ఇద్దరు వ్యక్తులపై ఆదివారం వేధింపుల కేసు నమోదైంది. ఎస్ఐ ప్రతాప్ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన కొమ్మెర శ్రీనుకు ఇదే గ్రామానికి చెందిన బిరుసంటి మేనకతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. వివాహ సమయంలో కట్న కానుకలు ఇచ్చినా కొన్ని నెలల నుంచి అదనపు కట్నం కోసం భర్త, అత్త ఆరోగ్యమ్మ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు భర్త, అత్తపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సచివాలయంలో దొంగలు పడ్డారు!

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శివారులోని సాయిబాబా గుడి సమీపంలో ఉన్న నాల్గవ గ్రామ సచివాలయంలో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. తలుపుకు ఉన్న తాళాన్ని పగలగొట్టి బీరువా తెరచి నగదు కోసం గాలించారు. ఏమీ దొరక్కపోవడంతో బీరువాలోని రికార్డులకు సంబంధించి పేపర్లను చిందరవందరగా పడేసి వెళ్లిపోయారు. అయితే కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర ఎల్రక్టానిక్ వస్తువుల జోలికి వెళ్లలేదు. స్థానికులు గమనించి సచివాలయ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అకతాయిలు, మందుబాబులు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉండవచ్చని వారు భావిస్తున్నారు.

ఎస్టీ సాధనకు ఐకమత్యంగా పోరాడాలి

డోన్ : వాల్మీకులు ఐక్యంగా ఉండి ఎస్టీ సాధనకు పోరాడాలని కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవక్రిష్ణ అన్నారు. స్థానిక షాదీఖానాలో ఆదివారం వాయిస్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో డాక్టర్ మాధవక్రిష్ణను వాల్మీకి సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ నారాయణ, వాల్మీకి సంఘం నేతలు బుర్రు శ్రీధర్‌నాయుడు, ఆర్మీ రామయ్య, వంశి, బేతంచెర్ల జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి, కౌన్సిలర్లు ఆర్టీ రమణ, సుమలత సురేష్, బుర్రు రమాదేవి, మేకల విమల, న్యాయవాది మేరియా కుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కోవెలకుంట్ల: స్థానిక జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు గాయపడ్డారు. ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. ఉయ్యాలవాడ మండలం పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన దినేష్‌రెడ్డి పట్టణంలో హోటల్ నిర్వహిస్తున్నాడు. రాత్రి కావడంతో హోటల్ మూసివేసి అదే గ్రామానికి చెందిన అసిస్టెంట్ రమణ అనే యువకుడిని బైక్‌పై ఎక్కించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. కోవెలకుంట్ల మండలం పొట్టిపాడు మెట్ట సమీపంలో బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు గాయపడ్డారు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేయడంతో సిబ్బంది క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం దినేష్‌రెడ్డిని మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు సన్మానం



ఎర్రబోతుల పాపిరెడ్డిని సన్మానించిన రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

కొలిమిగుండ్ల: ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కొలిమిగుండ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ మానుకుంట ప్రతాప్ రెడ్డి సన్మానించి మెమెంటో అందజేశారు. అంతకు ముందుగా రెడ్డీస్ వారధి క్యాలెండర్‌ను చైర్మన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. రెడ్డి సంక్షేమ సంఘానికి తన వంతు సహకారం ఉంటుందని జెడ్పీ చైర్మన్ తెలిపారు. అలాగే జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పులి ప్రకాష్‌రెడ్డి,పేరం సత్యనారాయణరెడ్డి,నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

డోన్ టౌన్ : ఆధునిక డిజిటల్ యుగంలో టెక్నాలజీని అందిపుచ్చుకుంటే అన్ని రంగాల్లో రాణించవచ్చు అని హైదరాబాద్‌కు చెందిన పీవీ డిజిటల్ కోడ్స్ సంస్థ మాస్టర్ ట్రైనర్ పవన్‌కుమార్ వావిలాల అన్నారు. స్థానిక పోటాన్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు సాయినాథ్ ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్‌పై నిరుద్యోగ యువతకు ఇస్తున్న రెండు రోజుల శిక్షణ(వర్క్ షాప్) ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన యాప్‌ల క్రియేషన్స్, వాటి ఉపయోగాలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ముగ్గురికి నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు మరో ఎనిమది మందికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు.

సేవామూర్తి విన్సెంట్ ఫెర్రర్

ప్యాపిలి: ఆర్డీటీ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ సేవామూర్తి అని ఎన్ రంగాపురం సర్పంచ్ జెర్రిబండ సుబ్బారెడ్డి, చిన్నపొదిళ్ల వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆదివారం విన్సెంట్ ఫెర్రర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న ఆర్డీటీ సేవలు అభినందనీయమన్నారు. విన్సెంట్ ఫెర్రర్ ఆశయ సాధనకు ఆర్డీటీ కృషికి దాతల సహకారం సంతోషకరమన్నారు.కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది నాగేశ్వర్ రెడ్డి, మురళి, సుధాకర్‌రెడ్డి, బాలాజి, ఈడీసీ మెంబర్ ఉమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ విజేత సిమెంట్ నగర్ జట్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో వెలసిన పర్వత వర్ధనీ రామనాథేశ్వర, సీతారామ కల్యాణ మహోత్సవం సందర్భంగా పాణ్యం సిమెంట్స్ యాజమాన్యం ఆధ్వర్యంలో మండల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ఈనెల 5వ తేదీన ప్రారంభించారు. ఎనిమిది జట్లు పాల్గొన్న పోటీలు హోరాహోరీగా సాగాయి. చివరకు సిమెంట్ నగర్ ఆర్ఆర్ఆర్ జట్టు విన్నర్‌గా, కందికాయపల్లె జట్టు రన్నర్ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం సహకారంతో రిటైర్డ్ డీఎస్పీ నరసింహారెడ్డి, జీఎం రాఘవరెడ్డి, ఏజీఎం రఘునాథ్‌రెడ్డి చేతుల మీదుగా రూ.12 వేలు, రూ.8 వేల చొప్పున నగదుతోపాటు షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యాకోబ్, నాగ శంకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.